
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
శనివారం 13 ఏప్రిల్ 2024



ఇక సమరమే!



ప్రధాన పార్టీల అభ్యర్థులు వీరే..

నియోజక వర్గం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
వరంగల్	కడియం కావ్య	సుధీర్‌కుమార్	అరూరి రమేష్
మహబూబాబాద్	బలరాం నాయక్	మాలోతు కవిత	సీతారాంనాయక్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)


లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటం.. అటు వరంగల్.. ఇటు మహబూబాబాద్ పార్లమెంట్ స్థానా లకు ప్రధాన పార్టీలన్నీ అభ్యర్థులను ప్రకటించడంతో ఓరుగల్లు రాజకీయాలు హీటెక్కుతున్నాయి. కడియం షాక్ నుంచి తేరుకున్న బీఆర్ఎస్.. ఉత్కంఠకు తెర దించుతూ వరంగల్ అభ్యర్థిని ఖరారు చేసింది. దీంతో అభ్యర్థులంతా ప్రజాక్షేత్రంలో 'ఇక సమరమే' అంటూ తాడోపేడో తేల్చుకునేందుకు రెడీ అవుతున్నారు. కుల సమీకరణలతో పాటు గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లను లెక్కలు వేస్తు నేతలు వ్యూహాలకు పదను పెడుతున్నారు. గులాబీ పార్టీకి కంచుకోటలుగా ఉన్న వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాల్లో పాగా వేసేందుకు కాంగ్రెస్, బీజేపీలు బలమైన అభ్యర్థులను బరిలో దించగా, తమ స్థానాలను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నాలు చేస్తుంది. దీంతో ఒక్కసారిగా ఓరుగల్లు రాజకీయాలు హీటెక్కుతున్నాయి.

అభ్యర్థులు ఫైనల్....

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం వరంగల్, ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గం మహబూబాబాద్ లోక్‌సభ సీట్లకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారయ్యారు. బీఆర్ఎస్ తొలుత మార్చి 13న వరంగల్ అభ్యర్థిగా స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తెను ప్రకటించింది. కానీ తాను ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేయలేనంటూ మార్చి 27న బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన కావ్య 30వ తేదీన తన తండ్రి కడియం శ్రీహరితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ ఆమెను వరంగల్ అభ్యర్థిగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి ఎవరు అనే ఉత్కంఠ నెలకొంది. తెరపైకి పలువురి పేర్లు రావడం, అనేక నాటకీయ పరిణామాల మధ్య శుక్రవారం బీఆర్ఎస్ అధినేత హనుమకొండ జడ్పీ చైర్మన్‌గా ఉన్న సుధీర్‌కుమార్‌ను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో రెండు వారాలుగా నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. ఇక బీజేపీ నుంచి వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్, బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితలను ఖరారు చేశారు. ఇక బీజేపీ నుంచి మాజీ ఎంపీ సీతారాంనాయక్‌ను బరిలో ఉన్నారు. మాజీ ఎంపీలు బరిలో ఉండటంతో మానుకోట రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. కాగా, బీజేపీ నుంచి బరిలో దిగుతున్న ఇద్దరు అభ్యర్థులు అరూరి రమేష్, సీతారాంనాయక్ బీఆర్ఎస్ నుంచి వలస వచ్చిన నేతలే. వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య కూడా బీఆర్ఎస్ నుంచి వలస వచ్చిన వారే. వరంగల్ బరిలో ఉన్న ముగ్గురు కూడా బీఆర్ఎస్ నేపథ్యం ఉన్న వారే కావటం చర్చనీయాంశంగా మారింది. దీంతో ఎవరు ఓట్లకు ఎవరు ఎసరు పెడుతారో అనే ఉత్కంఠ కూడా అభ్యర్థుల్లో నెలకొంది. ఇక ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపికలో అధిష్ఠానవర్గం కుల సమీకరణలకు పెద్దపీటలు వేశాయి. వరంగల్ పార్లమెంట్ పరిధిలో మాదిగ సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉండటంతో బీజేపీ, బీఆర్ఎస్‌లు ఆ సామాజిక వర్గం నేతలకే టికెట్లు కేటాయించాయి. మాదిగ ఉపకులం అభ్యర్థిని కాంగ్రెస్ బరిలో దించింది. మూడు పార్టీలు కూడా మాదిగ సామాజిక వర్గం నుంచే అభ్యర్థులను బరిలో దించటంతో మాల సామాజిక వర్గం ఓట్లు ఎటువైపు మొగ్గు చూపుతాయే అనేది చర్చనీయాంశంగా మారింది.

- 'ఓరుగల్లు' ఉత్కంఠకు తెర దించిన బీఆర్ఎస్
- అభ్యర్థిగా సుధీర్‌కుమార్‌ను ప్రకటించిన అధినేత
- ఇప్పటికే ప్రజల్లోకి కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు
- గత అసెంబ్లీ ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసిన హస్తం పార్టీ
- వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు
- గులాబీ కంచుకోటల్లో పాగాకు కాంగ్రెస్, బీజేపీ ఎత్తులు

ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖరారుతో వేడెక్కిన ఉమ్మడి జిల్లా రాజకీయం




ప్రజాక్షేత్రంలోకి అభ్యర్థులు...

వరంగల్‌లో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు, మహబూబాబాద్‌లో మూడు పార్టీలు అభ్యర్థులు ఇప్పటికే ఖరారు కావటంతో ప్రజాక్షేత్రంలోకి దిగారు. వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలను కలిసి తనకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరుతున్నారు. పరకాల, భూపాలపల్లి, స్టేషన్‌ఘనపూర్ తదితర నియోజక వర్గాల్లో నిర్వహించిన బూత్ కమిటీల సమావేశాల్లో పాల్గొంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో తన చేరిక, తన కులం, మతంపై వస్తున్న ఆరోపణలు, విమర్శలను తిప్పికొడుతూ ప్రసంగాలు సాగిస్తున్నారు. ఇక ఊరూరా తిరిగి ఇంటింటి ప్రచారానికి

మిగతా 7వ పేజీలో..

బీఆర్ఎస్ అభ్యర్థిగా మారపెల్లి

- జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్‌కు వరంగల్ లోక్‌సభ టికెట్
- అధికారికంగా ప్రకటించిన అధినేత కేసీఆర్



రాంనగర్, ఏప్రిల్ 12: వరంగల్ బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థిగా డాక్టర్ మారపెల్లి సుధీర్‌కుమార్‌ను ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ అధినేత కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌లో వరంగల్ లోక్‌సభ పరిధిలోని బీఆర్ఎస్ నేతలతో భేటీ అయ్యారు. నేతల అభిప్రాయాలు తీసుకున్న తర్వాత సుధీర్‌కుమార్ పేరును అధికారికంగా ప్రకటించారు.

కాగా, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యను తొలుత బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ ఆమె అనూహ్యంగా పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఆపై కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ నుంచి బరిలో నిలిచారు. ఈ క్రమంలో పార్టీని వీడిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్యను తిరిగి తీసుకువచ్చి బరిలో నిలపాలని మంతనాలు జరిపారు. బీఆర్ఎస్ నేతల సూచన మేరకు ఫామ్‌హౌస్ సమీపంలోని ఒక హోటల్‌లో రాజయ్య బస చేశారు. కేసీఆర్ పిలుపు కోసం వేచి ఉన్నాడు. కేసీఆర్ భేటీలో జిల్లా నేతలు సైతం రాజయ్య వైపే మొగ్గు చూపినప్పటికీ

మిగతా 7వ పేజీలో..

బయోడేటా

పేరు	: మారపెల్లి సుధీర్ కుమార్
కులం	: మాదిగ (ఎస్సీ)
పుట్టిన తేదీ	: 30-8-1962
విద్యార్హతలు	: ఎం.డి. (యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్)
తండ్రి పేరు	: మారపెల్లి జాన్
తల్లి పేరు	: కిరీటమ్మ
భార్య	: శోభారాణి(మెడికల్‌ఆఫీసర్)
కుమారుడు	: సుజన్‌కుమార్ (బీటెక్)
కూతురు	: సుకీర్తి (అసిస్టెంట్ సివిల్ సర్జన్)
నివాసం	: ముల్కనూర్, భీమదేవరపల్లి మండలం, హనుమకొండ

అరూరి రమేశ్‌వి చిల్లర రాజకీయాలు



- నా బిడ్డగా కావ్యకు నా కులమే వర్తిస్తుంది
- నా వల్లే రమేశ్ కాంట్రాక్టర్‌గా, ఎమ్మెల్యేగా ఎదిగాడు
- బీఆర్ఎస్ నుంచి డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే తప్పుకుంటాం
- మాదిగ జాతి ద్రోహి మందకృష్ణ : కడియం శ్రీహరి

7

కడియం ఎమ్మెల్యే కాకముందే నేను కాంట్రాక్టర్‌ను..



- ఆయన ఆస్తులను ప్రజలు గమనిస్తున్నారు
- ఇన్నాళ్లు అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ ఎందుకు గుర్తుకు రాలేదు?
- ఏ లబ్ధి కోసం పార్టీ మారారో ప్రజలకు చెప్పాలి
- వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్

7

జనగామ మార్కెట్ కార్యదర్శి సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్
కొత్త సెక్రటరీగా శ్రీనివాస్‌కు బాధ్యతలు

జనగామ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): విధుల్లో అలసత్వం వహించారన్న కారణంతో జనగామ మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి జి.భాస్కర్‌ను సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు భాస్కర్‌ను సస్పెండ్ చేస్తూ జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా శుక్రవారం ఉత్వర్వులు జారీ చేశారు. ఈ నెల 10న జనగామ మార్కెట్‌లో వరి ధాన్యాన్ని ట్రేడర్లు తక్కువ ధరకు కొనే ప్రయత్నం చేశారు. దీనిపై రైతులు తీవ్ర ఆందోళన చేశారు. ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి సైతం స్పందించారు. రైతులకు తక్కువ ధర చెల్లించాలని చూస్తే ఊరుకునేది లేదని ట్రేడర్లను, మార్కెట్ అధికారులను 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు. ఈనెల 10న రైతుల ఆందోళన ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దీనిపై సమగ్ర విచారణకు ఉన్నతాకారులు ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు, మార్కెటింగ్ అధికారులను నివేదిక కోరారు. దీనిపై రెండు శాఖలు ప్రభుత్వానికి నివేదిక పంపాయి. మరోవైపు ట్రేడర్లతో కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు రావడంతో మార్కెట్ కార్యదర్శి భాస్కర్‌పై మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి నివేదిక తెప్పించుకున్నారు. రైతుల ఆందోళన, రైతులకు ట్రేడర్లు చేస్తున్న అన్యాయంపై 'ఆంధ్రజ్యోతి' వచ్చిన కథనాలను జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సీరియస్‌గా తీసుకున్నారు. ఈ క్రమంలో మార్కెట్ కార్యదర్శి పనితీరుపై కలెక్టర్ విచారణ జరిపారు. విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో పాటు మార్కెట్‌లో రైతులకు సరైన వసతులు కల్పించలేకపోయారన్న కారణంతో భాస్కర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కలెక్టర్ అనుమతి లేకుండా జనగామ హెడ్‌క్వార్టర్స్ దాటి బయటకు వెళ్లకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కొత్త సెక్రటరీగా శ్రీనివాస్‌కు బాధ్యతలు

- జనగామ మార్కెట్ కమిటీ సెక్రటరీగా ఎస్.శ్రీనివాస్ నియామకమయ్యారు. స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ భాస్కర్ సస్పెండ్ కావడం తో మార్కెట్‌లో గ్రేడ్-3 సెక్రటరీ హోదాలో పనిచేస్తున్న శ్రీనివాస్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

రైతులను మోసగిస్తే క్రిమినల్ కేసులు

ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు
కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



జనగామ మార్కెట్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో ట్రేడర్లు, దళారులు రైతులను మోసం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా హెచ్చరించారు. జనగామ మార్కెట్ కమిటీలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం కొనుగోలుకు సంబంధించి జనగామ మండలం పెంబర్తి రైతువేదికలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 195 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులు తేమ, తాలు లేకుండా ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. జనగామ మార్కెట్ కార్యదర్శి భాస్కర్‌పై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రోజారాణి, సివిల్ సప్లై మేనేజరు ప్రసాద్ ఉన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ రిజ్వాన్ బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోళ్లలో ఇబ్బందులు, వ్యాపారుల మోసాలు, సౌకర్యాలకు సంబంధించిన సమస్యలపై రైతులు 8919288991 నంబరులో ఫిర్యాదు చేయాలన్నారు.

జలం.. గరళం

- జోరుగా నీటి దందా
- పుట్టగొడుగుల్లా వెలిసిన వాటర్ ప్లాంట్లు
- విచ్చలవిడిగా రసాయనాల వాడకం
- క్యాన్లలోనే సరఫరా
- రూ.కోట్ల వ్యాపారం
- జిల్లా వ్యాప్తంగా 800కు పైగా కేంద్రాలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



రఘునాథపల్లిలోని ఓ వాటర్ ప్లాంట్

రఘునాథపల్లి, ఏప్రిల్ 12 : జలమే జగతికి మూలం.. అలాంటి జలం గరళమవుతోంది.. జిల్లా వ్యాప్తంగా తాగునీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. వేసవి కాలం కావడంతో 'మూడు ప్లాంట్లు... ఆరు క్యాన్‌లు' అనే తరహాలో దినదినాభివృద్ధి చెందుతోంది. పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తూ ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్వాహకులు లక్షలు సంపాదిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. నీటి శుద్ధిలో ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమడుతున్నారు. క్యాన్ నీటికి అలవాటుపడిన ప్రజలు రోగాలను కొని తెచ్చుకుంటున్నారు. పేరుకే మినరల్ వాటర్..కాని తాగి చూస్తే అంతా జనరల్ అని తెలుస్తోంది. జిల్లాలో 800కు పైగా వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. వాటిలో ప్రమాణాలు పాటిస్తున్నవి కొన్ని మాత్రమే. ఇంత జరుగుతున్నా అటు అధికారులు గాని, ఇటు పాలకులు గాని పట్టించుకోకపోవడం గమనార్హం.

నిబంధనల ప్రకారం వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయలంటే పది రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అనారోగ్యాలకు ప్రధాన కారణం తాగు నీరేనని వైద్యులు చెబుతుంటారు. నీటిని కాచి, వడబోసి తాగమని సలహా ఇస్తుంటారు. అయితే అందుకు భిన్నంగా మినరల్ వాటర్ పేరుతో సాధారణ జలాన్ని క్యాన్‌ల ద్వారా ప్రజలకు అందిస్తున్నారు. కలుషితమైన నీటిలో బ్యాక్టీరియా చేరడం వల్ల వాటిని తాగిన వారు అనారోగ్యం పాలయ్యే అవకాశాలున్నాయి. మినరల్ వాటర్ పేరుతో జరుగుతున్న విక్రయాల్లో ఫంగస్ చేరి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. జిల్లాలో వాటర్ ప్లాంట్లు అనుమతులు లేకుండా విచ్చలవిడిగా వెలుస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

నెలకు రూ.5 కోట్ల నీటి అమ్మకం

వేసవి కాలంలో వాటర్ ప్లాంట్ల ద్వారా జోరుగా నీటి వ్యాపారం జరుగుతుంది. జిల్లాలో 75 శాతం మంది వాటర్ ప్లాంట్లకు సంబంధించిన నీటినే తాగుతున్నారు. దీంతో వాటర్ ప్లాంట్లకు మరింత డిమాండ్ పెరిగింది. 20 లీటర్ల క్యాన్ ధర ఇంటికి వస్తే రూ.10 నుంచి రూ.15 వరకు తీసుకుంటున్నారు. సగటున వాటర్ ప్లాంట్ల ద్వారా రోజుకు లక్ష పైచిలుకు నీటి క్యాన్‌లు సరఫరా అవుతున్నాయి. ఈ లెక్కన ఒక్క రోజులోనే రూ.15 లక్షల వరకు నీటి వ్యాపారం సాగుతుంది. వేసవిలో ఒక్కొక్క ప్లాంటు నిర్వాహకులు ప్రతీ రోజు 200 నుంచి 250 క్యాన్ల వరకు అమ్ముతున్నారు. జిల్లాలో సుమారు 800 వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటి ద్వారా నెలకు సుమారు రూ.5 కోట్లకు పైగా నీటి వ్యాపారం సాగుతుంది. ఇక ఎండా కాలం కావడంతో చల్లని తాగు నీటి పేరిట 15 లీటర్ల కూల్ క్యాన్‌కు రూ.50 వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు...

ఆధునిక యంత్రాల సహాయంతో బోరు నీటిని మూడు దశల్లో మినరల్ వాటర్‌గా తయారు చేయాల్సి ఉంటుంది. ముందుగా నీటిని క్లోరినేషన్ చేయాలి. క్లోరినేషన్ చేసిన నీటిని ప్రత్యేకమైన శాండ్ ఫిల్టర్ ద్వారా వడబోసి, కార్బన్, మైక్రాన్ ఫిల్టర్ల ద్వారా శుభ్రం చేయాల్సి ఉంటుంది. తర్వాత మరో కంపార్ట్‌మెంట్‌లోకి నీటిని పంపి అల్ట్రా వైలెట్, ఓజోనైజేషన్ ప్రక్రియ ద్వారా ఎటువంటి బ్యాక్టీరియా లేకుండా మార్చాల్సి ఉంటుంది. చివరి దశలో ఆక్సిజన్ పంపడం ద్వారా ఆక్సీకరణ జరిపి రంగు, రుచి, వాసన లేకుండా శుద్ధి చేయాలి. ఈ నీటిని వారం రోజుల లోపు వినియోగించాలి. కానీ అందుకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు వేసవి సీజన్ కావడంతో క్యాన్‌లలో బోరు నీటిని పట్టి వినియోగదారులకు అనుమానం రాకుండా రుచి కోసం మితిమీరిన రసాయనాలను కలుపుతూ నిబంధనలకు నీళ్లు వదులుతున్నా రు. మిషన్ భగీరథ నీటిలో 150 మినరల్స్ ఉంటే వాటర్ ప్లాంట్ నీటిలో 60 మినరల్స్ మాత్రమే ఉంటాయి.

రసాయనాలు వాడే వారిపై చర్యలు తీసుకోవాలి : పెద్దగోని రాజు, వెల్ది

నీటి శుద్ధి కేంద్రాలు కనీస ప్రమాణాలు పాటిం చడం లేదు. వాటిలో రుచి కోసం అనవసర రసాయనాలు వాడుతున్నారు. వీటి వల్ల ఆరోగ్యం పాడయ్యే అవకాశం ఉంది. వాటర్ ప్లాంట్లపై అధికారుల తనిఖీలు లేకపోవడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. డబ్బులు కూడ ఎక్కువగా తీసుకోని ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నారు. వాటర్ ప్లాంట్లపై పట్టణాలలో అయితే మున్సిపల్ , గ్రామాలలోనయితే పంచాయతీ అధికారుల పర్యవేక్షణ ఉండాల్సిన అవసరం ఉంది.

అనుమతులు తప్పనిసరి : కృష్ణమూర్తి, ఆహార కల్తీ నియంత్రణ జిల్లా అధికారి

ప్యాకేజీ డ్రింకింగ్ వాటర్‌కు ఎస్ఐ అనుమతి పొందని వాటిపై మా శాఖ తరఫున చర్యలు తీసుకుంటాం. నాన్ బీఎస్ఐల వాటిపై మున్సిపల్ పరిధిలో మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల పరిధిలో పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలి. వాటర్ ప్లాంట్ల నిర్వహణకు సంబంధించిన సమస్యలను మున్సిపల్ పరిధిలో ఆర్డీవోకు నివేదిస్తే ప్రభుత్వ నిబంధనలను పాటించని వాటర్ ప్లాంట్లను సీజ్ చేసే అధికారం ఆర్డీవోకు, గ్రామ పంచాయతీల పరిధిలో నిబంధనలను పాటించని వాటర్ ప్లాంట్లను సీజ్ చేసే అధికారం ఆయా మండలాల తహసీల్దార్లకు ఉంది. వాల్టా చట్టం 133 ప్రకారం లోకల్ అధికారులు నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలి.



వాటర్ ప్లాంట్ల నుంచి ట్రాలీ ఆటోలో తరలిస్తున్న వాటర్ క్యాన్లు

పేదలకు అండగా ఉండేది కాంగ్రెస్సే

- ఆగమైన రాష్ట్రాన్ని బాగు చేసుకోవాలి
- బీఆర్ఎస్ పని ఖతమైంది.. బీజేపీకి డిపాజిట్లు కూడా రావు
- భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



జనగామలో మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

జనగామ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అధికారం ఉన్నా లేకుండా ప్రజల పక్షాన నిలబడే పార్టీ కాంగ్రెస్సేనని, పేదలకు అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీయేనని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. జనగామ జిల్లాకేంద్రంలోని ప్రెస్టన్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల జనగామ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన కేసీఆర్ అప్పుల పాలు చేశారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో ఆగమైన రాష్ట్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో బాగుచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో బండ్లు ఓడలు, ఓడలు బండ్లు అయ్యాయని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఒకప్పుడు కేసీఆర్‌ను చూస్తే తలవంచినోళ్లే ఇప్పుడు ఆయన దగ్గరకు కూడా పోవడం లేదని అన్నారు. కేసీఆర్ టికెట్ ఇస్తా అంటే కూడా ఎవరూ ముందుకు రావడం లేదని విమర్శించారు. కడియం శ్రీహరికి టికెట్ ఇస్తే ఆ టికెట్‌ను విసిరేసి కాంగ్రెస్‌లో చేరారన్నారు. కాంగ్రెస్‌లో చేరుతామంటూ చాలా మంది తనకు ఫోన్లు చేస్తున్నా రని అన్నారు. కాంగ్రెస్ బతకదు అన్నవారే ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరుతామంటున్నారని, కాంగ్రెస్ పార్టీకి అంతటి డిమాండ్ వచ్చిందని అన్నారు. అధికారం వచ్చిందని కాంగ్రెస్ పార్టీ విర్రవీగదని అన్నారు. భువనగిరి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి అత్యధిక మెజారిటీ ఇచ్చిన గెలిపించుకోవాలని అన్నారు. 2009లో తనకు అన్ని నియోజకవర్గాల కంటే జనగామనే ఎక్కువ మెజారిటీ ఇచ్చిందన్నారు. సోనియాగాంధీతో కొట్లాడి మరీ తెలంగాణను సాధించానని అన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు నియోజకవర్గంలోని అన్ని ఊర్లలో బోర్లు వేయించానన్నారు. కాంగ్రెస్‌లో ఏవైనా బేదాభిప్రాయాలు ఉంటు నాలుగు గోడల మధ్య కూర్చొని మాట్లాడుకోవాలని హితవు పలికారు. శత్రువుల

మిగతా 8వ పేజీలో...

మహిళను మోసం చేసిన వ్యక్తి అరెస్టు



హనుమకొండ టౌన్, ఏప్రిల్12: పోలీసునంటూ భర్త లేని ఒంటరి మహిళను మోసం చేసిన ఘటనలో నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ వై.సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన మహిళతో రాజన్న సిరిసిల్ల జిల్లా చీర్లవంచకు చెందిన మామిడి కిరణ్ పోలీసునంటూ పరిచయం పెంచుకున్నాడు. వివాహం చేసుకొని, తన ఇంటిని బాధిత మహిళ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుతానని మాయ మాటలు చెప్పి మహిళ నుంచి బంగారు ఉంగరం, పుస్తెలతాడు, చైన్ తీసుకున్నాడు. వివాహం విషయం ప్రస్తావించగానే ఇంకోసారి వివాహమంటే చంపుతానని బెదిరించి మహిళ నుంచి మరో లక్ష ఫోన్‌పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. నిందితుడి వేధింపులు భరించలేని బాధిత మహిళ ఈనెల 7న ఫిర్యాదు చేయగా పక్కా సమాచారంతో శుక్రవారం ఉదయం హనుమకొండ బస్టాండ్‌లో నిందితుడి అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామని సీఐ వెల్లడించారు. నిందితుడి నుంచి పుస్తెలతాడు, ఏపీ పోలీసుశాఖతో ఉన్న నకిలీ ఐడీ కార్డును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ధార్మిక భవన్ స్థలంపై
కొత్త వివాదం

- స్థలం తమదంటున్న మేడారం జాతర పూజారులు
- వేదపాఠశాలను ధార్మిక భవన్‌లోకి తరలించకుండా మెలిక
- స్థలం తమదేనని దేవాదాయశాఖ అధికారుల స్పష్టం

హనుమకొండ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ధార్మికభవన్ స్థలంపై కొత్త వివాదం తలెత్తింది. భద్రకాళి దేవాలయం ప్రాంగణంలో ఉన్న వేద పాఠశాలలను ధార్మిక భవన్‌లోకి తరలించేందుకు దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర పూజారులు ఈ కొత్త వివాదానికి తెరతీశారు. ధార్మిక భవన్ నిర్మించిన స్థలం తమదేననే వాదన లేవనెత్తారు. మేడారంలోని సమ్మక్క, సారలమ్మ జాతరకు సంబంధించి గెస్ట్‌హౌస్‌ను వరంగల్‌లో ఏర్పాటు చేయడానికి ఉద్దేశించి ఈ స్థలం అప్పట్లో ఇచ్చారని మేడారం పూజారులు వాదిస్తున్నారు. ధార్మిక భవన్‌లో వేద పాఠశాల ఏర్పాటు చేయడం ద్వారా రూ.కోట్ల విలువ చేసే ధార్మిక భవన్‌ను భద్రకాళి దేవస్థానానికి స్వాధీనం చేసేందుకు దేవాదాయ శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారన్నది వారి ఆలోచన. ఈ ప్రయత్నాలను ఆపకపోతే మేడారంలో విధులను బహిష్కరిస్తామని కూడా హెచ్చరిక చేశారు. మేడారం పూజారులు పెట్టిన ఈ మెలికతో ధార్మిక భవన్‌లోకి వేద పాఠశాల తరలింపుపై అనిశ్చిత పరిస్థితి ఏర్పడింది.

రికార్డుల్లో దేవాదాయ శాఖదే..

దేవాదాయ శాఖ వాదన మరో విధంగా ఉంది. ఈ స్థలం దేవాదాయ శాఖదేనని అధికారులు చెబుతున్నారు. స్థలానికి సంబంధించి అందుబాటులో ఉన్న రికార్డులు కూడా ఇదే చెబుతున్నాయి. సర్వే నెంబరు 725లో 1014 గజాల స్థలాన్ని 1993 సెప్టెంబర్ 30వ తేదీన అప్పటి కలెక్టర్ బి7/55/93 ద్వారా దేవాదాయ శాఖకు కేటాయించినట్టు రికార్డులు చెబుతున్నాయి. వరంగల్ పాత సెంట్రల్ జైలుకు ఎదురుగా వరంగల్-హనుమకొండ ప్రధాన రహదారికి అనుకొని ఉన్న ఈ స్థలాన్ని వాస్తవానికి మొదట ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు జీవితబీమా సంస్థకు అప్పగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయి. అయితే అప్పటికే భద్రకాళి దేవస్థానం భక్తుల సౌకర్యార్థం ధర్మసత్రాల నిర్మాణానికి స్థలం కోసం కలెక్టర్‌కు వినతి చేసి ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని జీవిత బీమా సంస్థకు ఈ ఇక్కడ కాకుండా మరోచోట కేటాయించారు. ఆలా ఈస్థలం దేవాదాయ శాఖకు కేటాయించినట్టు సమాచారం.

లోకాయుక్తకు వెళతాం..

ధార్మిక భవన్‌పై మేడారం పూజారుల ఈకొత్త వివాదం వెనుక ఓ అధికారుల తెర వెనుక పాత్ర ఉన్నట్టు అనుమానం కలుగుతోందని కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ కన్వీనర్ చీకటి రాజు అనుమానం వ్యక్తం చేశారు. మొదటి నుంచి వేద పాఠశాలను ధార్మికభవనంలోకి తరలించడం ఇష్టం లేనందువల్ల పరోక్షంగా మేడారం పూజారులను రెచ్చగొట్టడం ద్వారా అడ్డుపుల్ల వేసే ప్రయత్నాలు జరుగుతున్నట్టు కనిపిస్తోందన్నారు. అవసరమైతే దీనిపై లోకాయుక్తకు వెళతామని స్పష్టం చేశారు.

అరూరి రమేశ్‌వి చిల్లర రాజకీయాలు

● కులం, మతాన్ని అడ్డు పెట్టుకొని రాజకీయాలు చేయొద్దు.. ● నా వల్లే రమేశ్ కాంట్రాక్టర్‌గా, ఎమ్మెల్యేగా ఎదిగాడు.. ● మీడియాతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి


డీసీసీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 12: బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండిపడ్డారు. తన కూతూరు వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య కులం, వివాహం వంటి వ్యక్తిగత విషయాలపై రమేశ్ మాట్లాడడం అనైతికమని ధ్వజమెత్తారు. శుక్రవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన అరూరి రమేశ్‌పై విరుచుకుపడ్డారు. కావ్య వరంగల్‌లో జన్మించి ఇక్కడే విద్యాభ్యాస్యం పూర్తి చేసిందన్నారు. వర్ధన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టరుగా పని చేసిందన్నారు. కావ్య ముస్లింను వివాహం చేసుకున్న విషయాలపై అరూరి రమేశ్ ఇష్టారాజ్యంగా మాట్లాడడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. రాజకీయాల్లో ఆరోపణలు, విమర్శలు ఉంటాయని, కానీ వ్యక్తిగత విషయాలను రాజకీయం చేయడం అనైతికమని పునరుద్ఘాటించారు. కబ్జాల చరిత్ర ఉన్న రమేశ్‌ను ఊళ్లలోకి రానివ్వకుండా ప్రజలు ఎదురు తిరిగారని చెప్పారు. అలాంటి చరిత్ర తమకు లేదన్నారు.

కడియం కావ్య వివాహం స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ మేరకు జరిగిందని శ్రీహరి వివరించారు. ఈ చట్టం ప్రకారం మతాంతర వివాహం జరిగినప్పటికీ భార్యభర్తలు ఎవరికి వారు తమ మతాన్ని ఆరాధించుకోవచ్చని తెలిపారు. భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు మతం మారినా కులం మారదని వివరించారు. పిల్లలకు తండ్రి కులమే వర్తిస్తుందన్నారు. ఈ మేరకు తన బిడ్డగా కడియం కావ్యకు తన కులమే వరిస్తుందని కడియం శ్రీహరి వివరించారు. రాజ్యాంగం, చట్టాలపై అవగాహన లేని అరూరి రమేశ్.. ఇతర బీజేపీ నాయకులతో పాటు బీఆర్ఎస్ నాయకులు కావ్య మతం, కులం, ప్రాంతం విషయంలో చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కడియం కావ్య ఎస్సీ కాదని నిరూపించగలరా? అంటూ శ్రీహరి సవాల్ విసిరారు. ఎవరెన్ని చిల్లర రాజకీయాలు చేసినా కావ్య గెలుపు ఖాయమైందని శ్రీహరి ధీమాగా చెప్పారు.

అరూరి రమేశ్ క్లాస్-1 కాంట్రాక్టర్‌గా, ఆ తరువాత రాజకీయంగా, ఎమ్మెల్యే స్థాయికి ఎదిగింది తన వల్లేనని శ్రీహరి చెప్పుకొచ్చారు. కేసీఆర్‌కు చెప్పి 2014లో ఆయనకు ఎమ్మెల్యే టికెట్ ఇప్పించినట్లు తెలిపారు. తాను ఎవరికీ వెన్నుపోటు పొడవలేదన్నారు. నిజాయితీ, నైతిక విలువలే తనకు రాజకీయ అవకాశాలు తెచ్చిపెట్టాయన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల నుంచి తాను డబ్బులు తీసుకున్నట్లు వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని కడియం శ్రీహరి కొట్టి పారేశారు. డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే వరంగల్ లోకసభ నుంచి కడియం కావ్య తప్పకుంటుందని స్పష్టం చేశారు. మంద కృష్ణ మాదిగ జాతి ద్రోహి అని కడియం శ్రీహరి ఆరోపించారు. దళితులు, ముస్లింలు ఇతర మైనారిటీలపై బీజేపీ ఆరాచకంగా వ్యవహరిస్తుంటే.. ఆ పార్టీ పంచన ఎలా చేరుతారని శ్రీహరి ప్రశ్నించారు. మందకృష్ణ మాదిగ దళిత జాతి ఉద్ధారకుడని ఎలా అంటామని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి కొమ్ము కాస్తూ దళిత జాతి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నాడని మండిపడ్డారు.

రమేశ్‌కు ఓటమి భయం పట్టుకుంది

బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్‌కు ఎన్నికకు ముందే ఓటమి భయం పట్టుకుందని కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య విమర్శించారు. తన వ్యక్తిగత విషయాలను రాజకీయం చేయడంలోనే రమేశ్ పతనం ప్రారంభమైందన్నారు. ఆయనకు డిపాజిట్ కూడా దక్కదన్నారు. వర్ధన్నపేటలో భూకబ్జాలు చేసింది చాలక ఇక మిగతా ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కబ్జాల కోసమే ఎంపీగా పోటీ చేస్తున్నాడని రమేశ్‌పై మండిపడ్డారు.

కావ్య గెలుపునకు కృషి

డాక్టరు కావ్య విజయం కోసం సమష్టిగా కృషి చేస్తున్నట్లు వరంగల్ లోకసభ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వెల్లడించారు. కావ్య వ్యక్తిగత విషయాలపై బీజేపీ, బీఆర్ఎస్ నోరు పారేసుకోవడం ఆ పార్టీల అభద్రతకు సంకేతమన్నారు. బీఆర్ఎస్ అవినీతి ఊబిలో కూరుకుపోయిందన్నారు. కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్టు డొల్లతనం బట్టబయలైందన్నారు. కవిత లిక్కర్ కేసులో చిక్కుకుందన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మరో పెద్ద తలకాయ ఒకటి రెండు రోజులు బయటపడనుందని రేవూరి ప్రకాశ్‌రెడ్డి వెల్లడించారు. కరువు యాత్ర పేరిట రైతులపై కేసీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు. ఖమ్మంలో రైతులకు సంకెళ్లు వేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కావ్య మూడు లక్షల మెజారిటీతో విజయం సాధించడం ఖాయమన్నారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కబ్జాల చరిత్ర ఉన్న అరూరి రమేశ్‌కు కడియం శ్రీహరి, కావ్యను విమర్శించే నైతిక హక్కు లేదని విమర్శించారు. కబ్జాల పాపం వల్లే అరూరి రమేశ్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓడించారని, ఎంపీగా కూడా ఇదే అనుభవం ఆయనకు దక్కనుందని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ దుయ్యబట్టారు. బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో కబ్జాలకు పాల్పడిన రమేశ్ బీజేపీలో చేరగానే పునీతుడు కాలేడని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మండిపడ్డారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీ పసునూరి దయాకర్, కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ కత్తి వెంకటస్వామి, వర్ధన్నపేట ఇన్‌చార్జి నమిండ్ల శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా, కార్పొరేటర్ తోట వెంకన్న, బంక సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కడియం ఎమ్మెల్యే కాకముందే నేను కాంట్రాక్టర్‌ను..

కడియం ఆస్తులను ప్రజలు గమనిస్తున్నారు.. ● ఇన్నాళ్లు అండర్ డ్రైనేజీ ఎందుకు గుర్తురాలేదు? ఏ లబ్ధి కోసం పార్టీ మారారో ప్రజలకు చెప్పాలి.. ● వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్


మడికొండలోని సత్యసాయి గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న అరూరి

హనుమకొండ టౌన్, ఏప్రిల్12: కడియం శ్రీహరి ఎమ్మెల్యే కాకముందే 1991లో తాను క్లాస్‌వన్ కాంట్రాక్టర్‌నని, తన ఎదుగుదలలో ఎవరి ప్రమేయం లేదని స్వయంకృషితో, ప్రజల ఆశీస్సులతో రాజకీయ ప్రతినిధిగా ఎదిగానని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ చెప్పారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనం లోక్‌సభ కన్వీనర్ కుమారస్వామి అధ్యక్షతన శుక్రవారం మడికొండలోని సత్యసాయి గార్డెన్‌లో జరిగింది.

ఈ సందర్భంగా అరూరి రమేశ్ మాట్లాడుతూ.. ప్రతీసారి నీతి, నిజాయితీకి కేరాఫ్‌గా చెప్పుకుంటున్న కడియం.. వేల కోట్ల ఆస్తులు ఎలా సంపాదించాడో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. 40 ఏళ్లుగా మంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీగా అధికారం అనుభవించి.. ఏనాడూ అండర్ డ్రైనేజీ మాట మాట్లాడనోడు.. ఇవాళ అండర్‌డ్రైనేజీ నిర్మిస్తానని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీఆర్ఎస్ టికెట్ ఇస్తే.. ఏంతీసుకొని కాంగ్రెస్ పార్టీలో చేరాడని ప్రజలు చర్చించుకుంటున్నారని విమర్శించారు. మూడోసారి ప్రధాని కాబోతున్న మోదీ బృందంలో ప్రతినిధిగా వరంగల్ నుంచి పంపిస్తే వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. సంగెం, మడికొండ టెక్స్‌టైల్ అభివృద్ధితోపాటు మామునూర్ ఎయిర్‌పోర్టు పునరుద్ధరణ, ఈ ప్రాంత యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. 10 ఏళ్ల వర్ధన్నపేట ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే.. ఏ విధంగా అభివృద్ధి చేశానో.. ఎంపీగా అవకాశం ఇస్తే రెట్టింపు సేవ చేస్తానని హామీ ఇచ్చారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఇతర నాయకులు తన గెలుపునకు కృషి చేయాలని కోరారు.

నెంబర్ వన్ స్థానంలో వరంగల్

దేశంలోనే వరంగల్ లోక్‌సభ నెంబర్‌వన్ స్థానంలో నిలవబోతుందని తెలంగాణ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ అన్నారు. బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. దేశవ్యాప్తంగా 400 సీట్లు, రాష్ట్రంలో 12 సీట్లు బీజేపీ కైవసం చేసుకోబోతోందని జోస్యం చెప్పారు. కాగా, అంతకుముందు మండల, డివిజన్, బూత్ అధ్యక్షుల ఇంటింటికీ ప్రచారంపై అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారుల వివరాలు, ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా బూత్ అధ్యక్షుల దగ్గర ఉండాలన్నారు. ప్రతీ ఇంటికి మోదీ, అభ్యర్థితో ఉన్న స్టిక్కర్లను పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, నాయకులు ధర్మారావు, గరికపాటి మోహన్‌రావు, చాడ సురేశ్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, మురళీధర్, విజయరామారావు, వివిధ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, దశమంత్‌రెడ్డి, నిశిధర్‌రెడ్డి, నాయకులు కీర్తిరెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కొండేటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓట్లు వేయొద్దు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ

న్యూశాయంపేట, ఏప్రిల్ 12: మాదిగల వ్యతిరేక పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓట్లు వేయొద్దని ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ సమాజానికి పిలుపునిచ్చారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వేద కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంద కుమార్ మాదిగ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మాదిగలను రాజకీయంగా అణచివేస్తోందని, అలాంటి కాంగ్రెస్ పార్టీని రానున్న ఎన్నికల్లో మాదిగలంతా ఏకమై చిత్తుగా ఓడించాలన్నారు. మాదిగలకు మొదటగా టికెట్ ఇవ్వని బీఆర్ఎస్ పార్టీకి కూడా ఓట్లు వేయొద్దన్నారు. ఈ నెల 15వ తేదీన పరకాలలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల లోక్‌సభ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని, పెద్ద సంఖ్యలో మాదిగ కులస్థులు హాజరై విజయవంతం చేయాలని మంద కుమార్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్పీ జాతీయ నాయకులు వేల్పుల సూరన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ, ఎమ్మెస్పీ వరంగల్ ఇన్‌చార్జి మంద రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు ఏకు శంకర్, చేతల్ల రమేష్, శివ, శ్రీనివాస్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


గవిచర్ల మోడల్ స్కూల్ ల్యాబ్‌లో పాఠ్యాంశాలను నేర్చుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

అటకెక్కిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు

అవగాహన లేకపోవడంతోనే పూర్తిస్థాయిలో ఏర్పాటు కాని వైనం

ఆన్‌లైన్‌తో ఏమీ చేయాలో తెలియని అవగాహన రాహిత్యం

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12: అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నిర్వహణ తూతూమంత్రంగా సాగుతోంది. నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో అటల్ ఇన్నోవేషన్ మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల్లో శాస్త్రీయ స్వభావాన్ని పెంపొందించి సృజనాత్మకతతో కూడిన వినూత్న ఆవిష్కరణలను సృష్టించే వాతావరణాన్ని ఏర్పాటు చేయడానికి పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల పేరుతో సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తోంది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను శాస్త్రీయ, సాంకేతిక రంగాల వైపు అడుగులు వడేందుకు వారిని ఆ మేరకు ప్రోత్సహించేందుకు ఈ ల్యాబ్‌లను ఉపయోగించాలని సూచిస్తోంది. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.12లక్షల నిధులను ఎంపికైన పాఠశాలకు మంజూరు చేస్తుంది. ల్యాబ్ ఏర్పాటైన తర్వాత ఒక్కో యేడాదికి రూ.2లక్షలను నిర్వహణ ఖర్చుల కింద మంజూరు చేస్తుంది. వరంగల్ జిల్లా పరిధిలో మొత్తం ఆరు పాఠశాలలు అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు ఎంపిక కాగా, ఇప్పటివరకు రెండు పాఠశాలల్లో మాత్రమే ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. మిగిలిన నాలుగు పాఠశాలల్లో వాటి ఊసే లేదు. హనుమకొండ జిల్లాలో నాలుగు ఎంపిక కాగా, రెండు మాత్రమే ఏర్పాటయ్యాయి. టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు సంబంధించిన అంశాలు పూర్తిగా ఆన్‌లైన్‌తోనే ముడిపడి ఉండటం, రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఎలాంటి సమాచారం లేకపోవడంతో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండటం లేదు. దీంతో ఎంపికైన పాఠశాలల్లో సైతం ల్యాబ్‌ల ఏర్పాటు జరగడం లేదు.

అంతా ఆన్‌లైన్‌తోనే ఇబ్బంది

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లనే ఏర్పాటు చేసుకోవాలంటే సంబంధిత నీతి ఆయోగ్ వెబ్‌సైట్‌లోనే విధివిధానాలు పొందుపరిచి ఉంటాయి. ఇక పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఈపథకానికి సంబంధించి ఎలాంటి సమాచారం తెలియదు. వారి పర్యవేక్షణ లేకుండానే కేంద్ర ప్రభుత్వం నేరుగా పథకాన్ని అమలు చేస్తుంది. దీంతో టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటుకు అన్ని అర్హతలు కలిగి ఉన్న పాఠశాలలు సైతం దరఖాస్తు చేసుకోలేకపోతున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారులకే అవగాహన లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులకు సైతం ఎలాంటి ముందస్తు అవగాహన కల్పించలేకపోతున్నారు. అవగాహన రాహిత్యంతో ల్యాబ్‌ల ఏర్పాటుకు అడ్డంకిగా మారుతుంది.

శాస్త్రీయభావాన్ని పెంపొందించేందుకు..

పాఠశాలల్లో టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ భావాన్ని పెంపొందుతుంది. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశం కూడా అదే. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ భావన పెంపొందించి తద్వారా వినూత్న ఆలోచనలతో సృజనాత్మక ఆవిష్కరణలు చేస్తారనే ఈ ల్యాబ్‌ల ఏర్పాటుకు పూనుకుంది. పాఠశాలల్లోనే శాస్త్ర, సాంకేతిక వాతావరణాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులను వినూత్న ఆవిష్కరణలవైపు పయనించేలా చేయడమే టింకరింగ్ ల్యాబ్‌ల ఆశయం.

ఏర్పాటుకు రూ.12లక్షలు, నిర్వహణకు రూ.2లక్షలు

కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా అటల్ ఇన్నోవేషన్ మిషన్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో తొలుత ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.12లక్షల నిధులను ఎంపికైన పాఠశాలకు మంజూరు చేస్తుంది. ఆ తరువాత ప్రతీ యేడు నిర్వహణ ఖర్చుల కింద రూ.2లక్షల నిధులు మంజూరు చేస్తుంది. వరంగల్ జిల్లాలో మొత్తం ఆరు పాఠశాలలు ఈ పథకానికి ఎంపిక కాగా, రెండు పాఠశాలల్లోనే పూర్తిస్థాయిలో ల్యాబ్‌లు ఏర్పాటు అయ్యాయి. మిగతా నాలుగు పాఠశాలల్లో ఎలాంటి ముందడుకు పడలేదు. గవిచర్ల, పర్వతగిరి మోడల్ స్కూళ్లలో టింకరింగ్ ఏర్పాటు అయ్యాయి. ఇక ఎంపికైన ఖానాపురం మండలం బుధరావుపేట మోడల్ స్కూల్, ధర్మారం జడ్పీహెచ్ఎస్, నెక్కొండ జడ్పీహెచ్ఎస్, నర్సంపేటలోని జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ పాఠశాలల్లో టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు అడుగులు పడలేదు. ఇక హనుమకొండ జిల్లాలో నాలుగు టింకరింగ్ ల్యాబ్‌లకు ఎంపిక కాగా, కేవలం మడికొండలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, ఎల్కతుర్తిలోని మోడల్ స్కూల్లో మాత్రమే టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటయ్యాయి.

మాకు సమాచారం ఉండటం లేదు..

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లకు సంబంధించిన ఎలాంటి సమాచారం మాకు అందుబాటులో ఉండటం లేదని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. అలాగే జిల్లా సైన్స్ అధికారులకు సైతం ఎలాంటి సమాచారం ఉండటం లేదని వారు చెబుతున్నారు. పూర్తిగా ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. మాకు ఎలాంటి సమాచారం లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించలేకపోతున్నాము. ఆసక్తి కలిగిన ప్రధానోపాధ్యాయులు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేస్తున్నారు. జిల్లాలో ఎన్ని పాఠశాలలు టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు ఎంపికయ్యాయనే కనీస సమాచారం సైతం మాకు అందుబాటులో ఉండటం లేదు.



కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలో నాయకులతో మాజీ ఎమ్మెల్యే రాజయ్య

నిరుత్సాహంలో తాటికొండ రాజయ్య

ఎర్రవెల్లికి వెళ్లి వెనుదిరిగిన మాజీ ఎమ్మెల్యే

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 12: బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ టికెట్ విషయంలో స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యకు చుక్కెదురైంది. కేసీఆర్ నుంచి ఏ క్షణం లోనైన ఫోన్ వస్తుందని, అందుబాటులో ఉండాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమాచారం ఇచ్చారు. అయితే హనుమకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్ కేసీఆర్‌తో ఫామ్‌హౌస్‌లో చర్చలు జరుపుతున్నాడనే విషయం తెలుసుకున్న రాజయ్య.. ఎర్రవెల్లికి వెళ్లకుండా సమీప గ్రామంలో నాయకులతో కలిసి వేచి ఉన్నాడు. ఈ క్రమంలోనే వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థిగా సుధీర్‌కుమార్ పేరు కేసీఆర్ ప్రకటించడంతో అసహనానికి గురైన రాజయ్య ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను కలువకుండానే వెనుదిరిగి వచ్చారు. కాగా కేసీఆర్ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ బాధ్యతలు, వరంగల్ లోక్‌సభ అభ్యర్థి గెలుపు బాధ్యతలు రాజయ్యను తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. రాజయ్య వెంట వెళ్లిన నాయకులు ఆకుల కుమార్, చల్లా చందర్ రెడ్డి, కేశిరెడ్డి మనోజ్ రెడ్డి, కనకం గణేష్, రంగు హరీష్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


మృతి చెందిన మహిళ

వరంగల్ క్రైం, ఏప్రిల్ 12: రోడ్డు ప్రమాదంలో చాపర్తి సాంబలక్ష్మీ (56) అనే కూలీ మృతిచెందిన సంఘటన సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సాంబలక్ష్మీ శుక్రవారం ఉదయం ఇళ్లలో పనిచేసి వస్తూ హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద కూరగాయలు తీసుకుంటుండగా ఆటో వచ్చి ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 ఫోన్ చేసి ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ సాంబలక్ష్మీ మృతి చెందింది. మృతురాలి కుమారుడు రాజమౌళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, ఏప్రిల్12: నిబంధనలు ఉల్లంఘించిన 17 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షూకూర్ తెలిపారు. 17 మందిని బుధవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రమేశ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 12 మందికి 17,300, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ ఐదుగురికి రూ.4,200 జరిమానాను విధించారన్నారు.

ఇక సమరమే!



(5వ పేజీ తరువాయి)

కావ్య ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ సైతం ఇప్పటికే అన్ని నియోజకవర్గాలల్లో ఒకసారి విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. పార్లమెంట్ స్థాయిలో బూత్ కమిటీల సమావేశాలు కూడా నిర్వహించి కార్యకర్తల్లోకి చొచ్చుకు పోతున్నారు. మోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేసేందుకు తనను గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి శుక్రవారమే ఖరారవటంతో గెలుపే లక్ష్యంగా ప్రజాక్షేత్రంలో దిగి గులాబీ పార్టీ కార్యాచరణ రూపొందిస్తోంది.

మహబూబాబాద్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్, బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత, బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్ ఇప్పటికే పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ముఖ్యనేతల సమావేశాలు నిర్వహిస్తున్నారు. తమ గెలుపునకు సహకరించాలని, గెలిస్తే నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి పనుల గురించి వివరిస్తున్నారు. మండుటెండలో కూడా అభ్యర్థులు ప్రచారంలో చెమటోడ్చుతున్నారు.

ఓట్ల లెక్కల్లో నేతలు..

2009లో జరిగిన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనలో హనుమకొండ పార్లమెంట్ స్థానం పరిధిలో వరంగల్ లోక్‌సభ ఏర్పడింది. తొలుత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించగా, 2014, 2016 (ఉపఎన్నిక), 2019లో వరుసగా బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. అలాగే మహబూబాబాద్ నుంచి 2009లో కాంగ్రెస్ విజయం సాధించగా, 2014, 2019లో వరుసగా బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఒక చోట బీఆర్ఎస్ విజయం సాధించింది. మొత్తం కాంగ్రెస్‌కు 6,61,545ఓట్లు పోలవగా, బీఆర్ఎస్‌కు 5,02,578ఓట్లు వచ్చాయి. ఇక బీజేపీకి 1,56,353ఓట్లు పోలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌పై 1,58,967ఓట్ల ఆధిక్యాన్ని కాంగ్రెస్ సాధించింది. అయితే వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లో బీజేపీకి గణనీయమైన ఓట్లు పోలయ్యాయి. దీంతో పాటు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ చేరికతోపాటు ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉండటంతో వర్ధన్నపేటలో కూడా బీజేపీకి కొంత బలం పెరిగిందనే చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరటంతో పాటు తన కూతురు కావ్యను ఎంపీ అభ్యర్థిగా బరిలో దించటంతో కాంగ్రెస్‌కు అదనపు బలంగా భావిస్తున్నారు. దీంతో వరంగల్ పార్లమెంట్ స్థానంలో ట్రయింగిల్ ఫైట్ ఏర్పడింది. మహబూబాబాద్ ఎంపీ స్థానంలో కూడా ఏడింటిలో ఆరు చోట్ల కాంగ్రెస్ విజయం సాధించగా, ఒక చోట బీఆర్ఎస్ ఎమ్మెల్యే గెలిచారు. అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్‌కు 6,85,897ఓట్లు పోలు కాగా, బీఆర్ఎస్‌కు 4,43,910 ఓట్లు వచ్చాయి. బీజేపీకి ఇక్కడ కేవలం 34,426 ఓట్లే పోలయ్యాయి. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌పై 2,41,987ఓట్ల ఆధిక్యతను కాంగ్రెస్ సాధించింది. అయితే భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరటంతో కాంగ్రెస్‌కు అదనపు బలం చేకూరిందనే చర్చ జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2009 నుంచి 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు పార్టీలకు సంప్రదాయంగా వస్తున్న ఓట్లను పరిగణంలోకి తీసుకుని ఆయా పార్టీల నేతలు గెలుపు లెక్కలు వేస్తున్నారు. దీంతో ఒక్కసారిగా ఓరుగల్లు రాజకీయాలు హీటెక్కుతున్నాయి.

2009 నుంచి 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు ఆయా పార్టీలకు పోలైన ఓట్లు

లోక్‌సభ స్థానం	సంవత్సరం	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	బీజేపీ
వరంగల్	2009	3,96,568	2,71,907	1,35,697(టీడీపీ)
వరంగల్	2014	2,69,065	6,61,639	1,87,139
వరంగల్	2016	1,56,315	6,15,403	1,29,868
వరంగల్	2019	2,62,200	6,12,498	83,777
అసెంబ్లీ ఎన్నికలు	2023	6,61,545	5,02,578	1,56,353
మహబూబాబాద్	2009	3,94,447	3,25,490(సీపీఐ)	1,45,299(పీఆర్‌పీ)
మహబూబాబాద్	2014	2,85,577	3,20,569	2,15,904 (టీడీపీ)
మహబూబాబాద్	2019	3,15,446	4,62,109	25,487(బీజేపీ)
అసెంబ్లీ ఎన్నికలు	2023	6,85,897	4,43,910	34,426(బీజేపీ)

బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మారపెల్లి



(5వ పేజీ తరువాయి)

కేసీఆర్ విముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో కేసీఆర్ అనూహ్యంగా సుధీర్‌కుమార్‌ను ప్రకటించడంతో నేతలంతా అధినేత నిర్ణయానికి తప్పనిపరిస్థితిలో ఒప్పుకున్నట్లు సమాచారం. మొత్తంగా రాజయ్యకే వరంగల్ ఎంపీ టికెట్ వస్తుందని ప్రచారం జరుగుతున్న క్రమంలో కేసీఆర్ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ పేరును ప్రకటించడం గమనార్హం.

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన సుధీర్‌కుమార్ ప్రస్తుతం హనుమకొండ జడ్పీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. భీమదేవరపల్లి మండల పరిషత్ అధ్యక్షుడిగా (1995-2000), కరీంనగర్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా (2001-2006) కాలంలో పదవిలో ఉన్నారు. 2001 నుంచి బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న సుధీర్‌కుమార్.. మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావుకు ప్రధాన అనుచరుడు.

సుధీర్‌కుమార్‌కు కేసీఆర్ ఫోన్

సుధీర్‌కుమార్‌కు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫోన్ చేసి ఆశీర్వదించారు. సుధీర్‌కుమార్ నివాసం, విద్యాభ్యాసం, వరంగల్‌తో ఉన్న అనుబంధం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని తేలిందన్నారు. వరంగల్‌లో గెలిచేది బీఆర్ఎస్ అని ఆయన తెలిపారు. జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేతలను వెళ్లి కలవాలని కేసీఆర్ సూచించారు. 15న సమన్వయ కమిటీ సమావేశం ఉంటుందని, జిల్లా నేతలను అందరిని కలిసి సహకారం తీసుకుని విజయం సాధించాలని కేసీఆర్ సూచించారు. కాగా, ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించిన కేసీఆర్‌కు, సహకరించిన జిల్లా నేతలకు సుధీర్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

రైతులు దళారులను ఆశ్రయించొద్దు

అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

నర్మెట, ఏప్రిల్ 12 : రైతులు పండించిన పంటను దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు అమ్ముకోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) రోహిత్‌సింగ్ అన్నారు. మండలంలోని హన్మంతాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎం ప్రసాద్, డీఎస్‌వో రోజారాణి, మండల వ్యవసాయ అధికారి డి. సంతోషి, ఏపీఎం మాదారపు రవి, సెంటర్ ఇంచార్జి యాదగిరి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.



హన్మంతాపూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలి

బచ్చన్నపేట : రైతులు తాము పండించిన ధాన్యంకు గిట్టుబాటు ధర రావాలంటే ప్రభుత్వంచే ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలని మండల పరిధిలోని ఏడు క్లస్టర్‌లలో ఉన్న ఏడు గ్రామాల్లో వ్యవసాయ విస్తరణాధికారుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కొన్నె, బచ్చన్నపేట, కేశిరెడ్డిపల్లి, పోచన్నపేట, నాగిరెడ్డిపల్లి, మన్‌షాన్‌పల్లి, కట్కూరు గ్రామాల్లోని సమావేశాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు లక్ష్యాలను వివరించారు. కాగా బచ్చన్నపేటలో ఎంపీడీవో రఘురామకృష్ణ లారీలో ధాన్యం లోడ్ అవుతున్న విధానాన్ని పరిశీలించారు. కొన్నె, మన్‌షాన్‌పల్లిలో ఏవో విద్యాకర్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామాల్లో ఏఈవోలతో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ పరిశీలన

చిలుపూర్ : రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి సంపూర్ణ మద్దతు ధరను పొందాలని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ (డీఎం) ప్రసాద్ సూచించారు. శుక్రవారం మండలంలోని రాజవరం, చిలుపూర్, దేశాయితండా తదితర గ్రామాల్లో పర్యటించిన ఆయన ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కార్యక్రమంలో ఏఈవో గుగులోత్ వినయ్‌కుమార్, ఐకేపీ ఏపీఎం ఈద రమేష్‌కుమార్, కాలువ కృష్ణారెడ్డి, సీసీలు గట్టు శ్రీనివాస్, రమాదేవి, కనకచంద్రం పాల్గొన్నారు.

● లింగాలఘణపురం : రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరను పొందాలని లింగాలఘణపురం పీఏసీఎస్ సీఈవో శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం లింగాలఘణపురం మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఐకేపీ, ప్యాక్స్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో వెంకటేశ్వర్లు, ఏఈవోలు స్పందన, అపూర్వ, సౌజన్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

● కొడకండ్ల : మండల రైతులు ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ సువర్ణ కోరారు. మండలకేంద్రంతో పాటు రామవరం గ్రామంలోని రైతు వేదికల్లో, గ్రామ కూడళ్లలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు కల్లాల్లోనే ధాన్యం ఆరబెట్టుకుని తేమ 17 లోపు ఉండేలా చూసుకుని కొనుగోలు కేంద్రానికి వస్తే త్వరగా కాంటా అవుతుందని తెలిపారు. ఏఈవో ప్రియాంక పాల్గొన్నారు.

● పాలకుర్తి : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనెగోలు కేంద్రాల్లో క్వింటాకు రూ. 2.203 ప్రభుత్వం నిర్ణయించిందని పాలకుర్తి ఏడీఏ పరశురాం అన్నారు. శుక్రవారం మండలంలోని ఈరవెన్ను, అయ్యంగారిపల్లి, వల్మిడి, గ్రామాల్లో రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు.

● దేవరుప్పుల : రైతుల పండించిన ధాన్యం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని పాలకుర్తి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ. పరుశరామ్‌నాయక్ కోరారు. శుక్రవారం మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 5 రైతు వేధిక క్లస్టర్లలోని 5గ్రామాలలో మొదటిరోజు అవగాహన సదస్సులు నిర్వహించగా ఆయన దేవునిగుట్టతండాలో వరి పండించిన రైతులకు జరిగిన.అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

● జఫర్‌గడ్ : రైతులు పండించిన తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని వ్యవసాయ విస్తరణాధికారులు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని హిమ్మత్‌నగర్, తిమ్మంపేట, తీగారం, ఓబులాపూర్, కూనూరు, తమ్మడపల్లి(జి), రఘునాథ్‌పల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. హిమ్మత్‌నగర్‌లో జరిగిన సమావేశంలో వ్యవసాయ విస్తరణాధికారి శిరీష మాట్లాడారు.ఏఈఓలు కీర్తి స్నేహ, అనిత, ప్రశాంత్, కల్పన పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు సడలించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి



జనగామ మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

జనగామ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన నిబంధనలను సడలించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. జనగామ మార్కెట్ కమిటీని శుక్రవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల 40 శాతం పంటలు ఎండిపోయాయని, చేతికొచ్చిన కొద్దిపాటి పంట కొనుగోలులో కూడా కొర్రీలు పెట్టడం వల్ల రైతులు నష్టపోతున్నారనారు. కేంద్రానికి ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి సకాలంలో డబ్బులు అందించాలన్నారు. జనగామ మార్కెట్‌లో ట్రేడర్లు కొనుగోళ్లు నిలిపివేయడం వల్ల మొక్కజొన్న, చింతపండు వంటి కొనుగోళ్లు ఆగిపోయాయన్నారు. సీపీఎం నాయకులు సాంబరాజు యాదగిరి, రమేష్, బూడిద గోపి ఉన్నారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 12: వచ్చే నెలలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయమని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కనకం గణేష్ తెలిపారు. శుక్రవారం ఛాగల్ క్లస్టర్ పరిధిలోని ఛాగల్, రాఘవపూర్, మీదికొండ గ్రామాల్లో జరిగిన బీఆర్ఎస్ పార్లమెంట్ సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అదేవిధంగా తాటికొండ క్లస్టర్ పరిధిలోని కొత్తపల్లి, తాటికొండ, జిట్టెగూడెం గ్రామాల పరిధిలో జరిగిన సమావేశాల్లో సీనియర్ నాయకుడు అక్కెపల్లి బాలరాజు పాల్గొని మాట్లాడారు. ఇప్పగూడెం క్లస్టర్ పరిధిలోని సముద్రాల, రంగరాయగూడెం, కోమటిగూడెం, ఇప్పగూడెం, అక్కపల్లి గూడెం గ్రామాల పరిధిలో జరిగిన క్లస్టర్ సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు గణేష్ పాల్గొని మాట్లాడారు. పాంనూర్ క్లస్టర్ పరిధిలోని నెమలిగొండ, విశ్వనాథపురం, తానేదార్‌పల్లి, చంద్రు తండ, పాంనూర్ గ్రామాలలో జరిగిన సమావేశంలో మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ చల్లా చందర్ రెడ్డి, పొన్నం రంజిత్‌కుమార్‌గౌడ్, పొన్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫంక్షన్‌హాళ్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి

● జనగామ ఏఎస్పీ అంకిత్‌కుమార్

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



ఫంక్షన్‌హాళ్ల యజమానులకు సూచనలు చేస్తున్న ఏఎస్పీ అంకిత్‌కుమార్

జనగామ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ఫంక్షన్‌హాళ్లలో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని జనగామ ఏఎస్పీ, ఐపీఎస్ అధికారి అంకిత్‌కుమార్ శంఖ్వార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఫంక్షన్‌హాళ్ల యజమానులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల జనగామ మండలం పెంబర్తిలో రెండు, జిల్లాకేంద్రంలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో దొంగతనాలు జరిగి పెళ్లి బిజీలో ఉన్న ఫొటోగ్రాఫర్ల కెమెరాలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనలో సుమారు రూ. 4.50 లక్షల విలువైన కెమెరాలు, డ్రోన్ చోరీకి గురయ్యాయి. ఈ క్రమంలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఏప్రిల్ 7న 'ఫంక్షన్‌హాళ్లపై పట్టింపేది' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల దొంగతనాలు జరుగుతున్నాయని, అగ్నిమాపక పరికరాలు లేకపోవడం వల్ల అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉందన్న అంశాలతో కథనం ప్రచురితం అయింది. దీనిపై స్పందించి ఏఎస్పీ అంకిత్‌కుమార్ స్పందించారు. ఫంక్షన్‌హాళ్ల యజమానులతో సమావేశం నిర్వహించి సీసీ కెమెరా లను, అగ్నిమాపక పరికరాలను తక్షణమే ఏర్పాటు చేసుకోవాలని సూచిం చారు. సమావేశంలో జనగామ సీఐ రఘుపతిరెడ్డి, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి మధుకర్ పాల్గొన్నారు. కాగా.. సీసీ కెమెరాల ఏర్పాటుపై పోలీస్ శాఖ, అగ్నిమాపక పరికరాల ఏర్పాటుపై ఫైర్ సేఫ్టీ అధికారులు జిల్లాలోని ఫంక్షన్‌హాళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు.

ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండల సమన్వయ కర్త, కొమురవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ మేక సంతోష్

చిలుపూర్, ఏప్రిల్ 12 : వచ్చే నెల 13న (మే 13) జరిగే వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని ఆ పార్టీ మండల సమన్వయ కర్త, కొమురవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ మేక సంతోష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని రాజవరం, చిన్నపెండ్యాల, వంగాలపల్లి, నష్కల్ తదితర గ్రామాల్లో పర్యటించిన ఆయన కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో జనగామ యాదగిరి, బత్తుల రాజన్‌బాబు, గుంటి భీముడు, మోటం రాములు, చిట్యాల దయాకర్, తాళ్ళపల్లి క్రాంతి కుమార్, చిర్ర రాజు, ఆరూరి స్వామి, ఎమ్డీ యాకూబ్ పాషా, పాశం కరుణాకర్, రంగు రవి, ఇల్లందుల వెంకటస్వామి, మద్దూరు వైస్ ఎంపీపీ మలిపెద్ది మల్లేషం, బొల్లు చంద్రమౌళి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా సాగాలి



జఫర్‌గడ్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

జఫర్‌గడ్, ఏప్రిల్ 12 : జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో వరంగల్ ఎంపీ స్థానంలో బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పార్టీ మండల ఇన్‌చార్జి నర్మెట జడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్‌నాయక్, ఆ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామిని శివరాజు కార్యకర్తలను కోరారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం జఫర్‌గడ్‌తో పాటు మండలంలోని తమ్మడపల్లి(జి), ఓబులాపూర్, ముగ్దుంతండా, శంకర్‌తండా, రేగడితండా, కూనూరు, తిమ్మాపూర్, సూరారం, షాపల్లి, తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. తమ్మడపల్లి(జి) సమావేశంలో శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి, పార్టీ తరఫున వరంగల్ ఎంపీ టికెట్ పొందిన కావ్య కాంగ్రెస్‌లో చేరి మోసం చేశారన్నారు. సమావేశాల్లో బీఆర్ఎస్ నేతలు పిట్టల రాజు, తాటికాయల వరుణ్, పెంతల రాజ్‌కుమార్, అరిగెల శ్రీరామ్, హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ నర్సింగం, శ్రీనివాస్, యార సోమిరెడ్డి, కొత్వాల కుమార్ పాల్గొన్నారు.

వరంగల్ పీఠం కాంగ్రెస్‌దే



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్‌నాయక్

కొడకండ్ల, ఏప్రిల్ 12 : రానున్న లోకసభ ఎన్నికలలో వరంగల్ లోకసభ పీఠంపై కాంగ్రెస్‌దేనని యూత్ కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు ధరావత్ రాజేష్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డి.యాకేష్ అధ్యక్షతన కార్యకర్తల విస్తృత స్థాయి నిర్వహించారు. సమావేశంలో జె.రాము, మసురం రవీందర్, వెంకన్న, స్వామి, సురేష్, సతీష్, కనకయ్య, రాకేష్ పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉండేది కాంగ్రెస్సే

(5వ పేజీ తరువాయి)

ముందు బలహీనం కావొద్దని సూచించారు. జనగామలో పల్లా, గిల్లా జాన్గానై అని అన్నారు. కేసీఆర్‌కు మందులో సోడా, పోసి ప్రగతిభవన్‌లో చెంచాగిరి చేసి పల్లా టికెట్ తెచ్చుకు న్నారని విమర్శించారు. నియోజకవర్గంలో ప్రజల కష్టాలు తెలవవని, ఎన్నడూ ఆయన తిరగలేదని అన్నారు. చెంచాగిరి చేసే పల్లా, గాలికి తిరిగే బూర నర్సయ్య గౌడ్ లాంటి వాళ్లతో ఒరిగేదేమీ లేదన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని ఖతం అయిందని, బీజేపీకి డిపాజిట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. తనను ఎంపీగా గెలిపిస్తే ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తనను ప్యారాచుట్ లీడర్ అంటూ కొందరు మాట్లాడుతున్నారని, తాను కాంగ్రెస్ పార్టీలో ఏళ్లుగా పనిచేస్తున్నానని, కొత్తవాడిని కాదని అన్నారు. జనగామలో కొమ్మూరిది ఓటమి కాదని, బీఆర్ఎస్ చేసిన మోసమని అన్నారు. దొంగ ఓట్లతో జిత్తులమారి పల్లా గెలిచారని విమర్శించారు.

తుదిశ్వాస వరకు ప్రజలతోనే ఉంటా: కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

తాను ఓడిపోగానే జనగామను విడిచిపోతానని కొందరు మాట్లాడారని, ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలెవరికీ అపోహలు వద్దని కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. తన తుదిశ్వాస వరకు జనగామలోనే, జనగామ ప్రజలతోనే ఉంటానని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో 25 వేల దొంగ ఓట్లు నమోదు చేయించి, కాంగ్రెస్ పార్టీకి పడే 6 వేల ఓట్ల తొలగించి పల్లా గెలిచారని విమర్శించారు. 5 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని 20 రోజుల పాటు కష్టపడాలని కార్యకర్తలకు సూచించారు. సభలో మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగంగౌడ్, పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ ఇంచార్జి భవానీరెడ్డి, నాయకులు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కంచె రాములు, వై.సుధాకర్, వేమళ్ల సత్యనారాయణరెడ్డి, బాలలక్ష్మీ, బడికె ఇందిర, బనుక శివరాజ్‌యాదవ్, నిమ్మతి మహేందర్‌రెడ్డి, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరంగల్ తరలిన బీజేపీ శ్రేణులు

పాలకుర్తి, ఏప్రిల్ 12 : పార్లమెంటు ఎన్నికలను పార్టీ శ్రేణులను సిద్ధం చేసేందుకు వరంగల్‌లో జరిగే బీజేపీ బూత్ కమిటీల సమ్మేళనానికి మండలం నుంచి ఆ పార్టీ శ్రేణులు వాహనాల్లో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీనే మరోసారి దేశ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. వరంగల్ తరలి వెళ్లిన నాయకుల్లో మండల అధ్యక్షుడు దుంపల సంపత్, కమ్మగాని శ్రీకాంత్‌చ మారం రవి, రామారావు, నిరంజన్‌రెడ్డి, పెనుగొండ సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి గంగాధర్ కన్నుమూత



గంగాధర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అంబేద్కర్ సంఘ ప్రతినిధులు

దేవరుప్పుల, ఏప్రిల్ 12: గ్రామీణ పేదరిక సంఘం జిల్లా కార్యదర్శి, యూసీసీఆర్ఐ-ఎంఎల్ నాయకుడు గేల గంగాధర్-(45) అనారోగ్యంతో ఆయన స్వగ్రామమైన మండలంలోని కోలుకొండలో గురువారం రాత్రి కన్నుమూశారు. అనారోగ్యం బారిన పడి టీబీతో చాలా కాలంగా అవస్థ పడుతూ హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆసుపత్రిలో చనిపోయారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గంగాధర్ 1999లో 9వ తరగతి విద్యార్థిగా యూసీసీఆర్ఐ-ఎంఎల్ అనుబంధ విద్యార్థి సంస్థ డీఎస్‌వోలో చేరి జనగామ ప్రాంతంలో పనిచేశారు. తర్వాత జనగామ ప్రాంతంలో జోనల్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. గ్రామీణ పేదల సంఘం జిల్లా నాయ కుడిగా పనిచేస్తూ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో యూసీసీఆర్ఐ-ఎంఎల్ పార్టీ నుంచి పాలకుర్తి నియోజకవర్గంనుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిల్చి ఓటమి చవిచూశారు. నిత్యం ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారు. గంగారావు చిన్ననాటి నుంచి కమ్యూనిస్టు భావాలతో పెరిగి తన చివరి శ్వాసవరకు కమ్యూనిస్టుగానే జీవించారు. ఈ సందర్భంగా తెలం గాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రె సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు జేరిపోతుల ఉపేందర్, యాదాద్రి జోన్ కోఆర్డినేట ర్, సీసీఐ-ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు గడ్డం సదానందం, నల్ల పెద్ద షైసయ్య ఆయన మృతదేహానికి పూలమాలవేసి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన లేని లోటు తీర్చలేనిదని ఎన్నికల బరిలో నిలిచి పాలకవర్గాల ఆశలకు తలవం చకుండా పేదల పక్షాన నిలబడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

బచ్చన్నపేట, ఏప్రిల్ 12: మండల కేంద్రమైన బచ్చన్నపేట చౌరస్తాలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. జిల్లా నారాయణ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్, ఎంపీటీసీలు నల్లగోని పుష్పబాలకిషన్‌గౌడ్, అల్వాల రాధ ఎల్లయ్యలు ప్రారంభించారు. గత నాలుగు సంవత్సరాలుగా వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడంపై కుటుంబ సభ్యులను అభినందించారు. హరికిషన్, మోహన్‌రెడ్డి, రాజయ్య, శ్రీనివాస్, నాగయ్య, రాజు, గాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జనగామ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం జనగామ జిల్లాకేంద్రంలోని అన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటలకు వరకు గంట పాటు కరెంట్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 12: మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన దాబత్తుల లచ్చమ్మ (70) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి శుక్రవారం మృతురాలి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ 5,000 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో అక్కెనపల్లి సత్యం, వెంకటయ్య, గొరేష్, సత్యనారాయణ, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సతీష్



లింగాలఘణపురం, ఏప్రిల్12: బీజేపీ ఓబీసీ సెల్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా లింగాలఘణపురం మండలం మాణిక్యాపురం గ్రామానికి చెందిన చౌదరిపల్లి సతీష్‌కుమార్‌ను నియామకమయ్యారు. ఈసందర్భంగా సతీష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్రస్థాయి బాధ్యతలను అప్పగించిన ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దివాకర్, జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

15న శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ

కొడకండ్ల, ఏప్రిల్ 12 : మండలంలోని రామవరం గ్రామంలో ఈ నెల 15న శ్రీరామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్లు కార్య నిర్వాహకుడు చెంచు రాజిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ 12న సాయంత్రం విష్వక్సేన ఆరాధనతో ప్రారంభమవుతుందని తెలిపారు. 15న యంత్ర ప్రతిష్ఠ, మూర్తి ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠలు జరుపనున్నట్లు తెలిపారు.

సరైన కాగితాలు లేకుంటే వాహనాల జప్తు

కొడకండ్ల, ఏప్రిల్ 12 : సరైన కాగితాలు లేని వాహనాలు లేకుండా నడిపితే జప్తు చేస్తామని పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులతో కలిసి స్థానిక పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. నెంబర్ ప్లేట్ లేని, సరైన కాగితాలు లేని వాహనాలను జప్తు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 1 డీసీఎం, రెండు కార్లు, 1 టాటా ఏసీ, 2 ఆటోలు, 2 బైక్‌లను జప్తు చేశారు. కొడకండ్ల ఎస్ఐ శ్రవణ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ కనకస్వామి, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

నేడు ట్రేడర్లతో సమావేశం

జనగామ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లపై ట్రేడర్లు, రైస్ మిల్లర్లు, అడ్తిదారులతో జనగామ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో శనివారం సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మార్కెట్ ఇంచార్జి కార్యదర్శి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ హాజరవుతారని తెలిపారు. ట్రేడర్లు, రైస్ మిల్లర్లు, అడ్తిదారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఘనంగా హనుమాన్ పడిపూజ



హనుమాన్ భక్తులతో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్

రఘునాథపల్లి, ఏప్రిల్ 12: మండల కేంద్రంలో హనుమాన్ చాలీసా పడిపూజ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ మాలధారణ భక్తుల జై హను మాన్..జై శ్రీరామ్ నినాదాలతో మండల కేంద్రం మార్మోగింది. మండల కేంద్రానికి చెందిన హనుమాన్ భక్తుడు కోళ్ల సూర్యతేజ గౌడ్ తన స్వగృహం వద్ద నిర్వహించిన హనుమాన్ చాలీసా పడిపూజ కార్యక్రమానికి హనుమాన్ మాలధారణ భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పూజ అనంతరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్-స్వప్న దంపతుల ఆధ్వర్యంలో మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో హనుమాన్ మాలధారణ భక్తులు కొన్నె సతీష్, కందుల అనిల్, మరాటి శ్రీశైలం, కోళ్ల సందీప్,సోముల మహేందర్, ద్యావర మహేష్, పెర్నే అనిల్, నితిన్, నాగరాజు,అడ్డూరి అనిల్, రాజు పాల్గొన్నారు.

'ఐటీ' రామయ్యను కలిసిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



చుక్క రామయ్యను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి, ఏప్రిల్ 12 : ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ ఐఐటీ రామయ్యను హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో శుక్రవారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామయ్య ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా రోజుల నుంచి రామయ్యను చూసేందుకు రావాలని అనుకున్నానని, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత బాధ్యతలు పెరిగాయని అందుకు రాలేక పోయానని అన్నారు. మాజీ పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, గూడూరు మాచెర్ల పుల్లయ్య ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

భువనగిరి రూరల్, ఏప్రిల్ 12: భువనగిరి పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో భువనగిరి పార్లమెంట్ పరిధిలోని భువనగిరి, ఆలేరు, జనగాం, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో ఆయన సమావేశమై ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించారు. ఈ నెల 18 నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతున్నందున కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌కు ఏర్పాటు చేయాలని నూతన ఓటరు జాబితాతో వివరాలు అందించాలన్నారు. నామినేషన్‌కు సంబంధించిన అన్ని ఫాంలపై హెల్ప్‌డెస్క్‌లో అభ్యర్థులకు సహాయం అందించాలని, పోటీచేసే అభ్యర్థి, బలపరిచే వారికి ఓటు హక్కు ఉన్నది లేనిది పరిశీలించడం, నామినేషన్ పత్రాలు నింపడం, జత చేసే పత్రాలపై అవగాహన కల్పించాలన్నారు. చెక్ పోస్టులను తరుచూ పరిశీలిస్తూ టీములు, షిఫ్టులవారీగా డ్యూటీలు తనిఖీ చేయాలని, సిబ్బందికి గుర్తింపు కార్డులు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సభలు, సమావేశాలకు, ర్యాలీలకు సంబంధించి సువిధ ద్వారా ఎన్ని అనుమతులు ఇచ్చారు. ఇచ్చిన వాటి వివరాలను సరైన విధంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, పార్లమెంట్ అభ్యర్థికి రూ.95లక్షలలోపు ఖర్చు నిబంధన ఉందని, మొదట వచ్చిన వారికి మొదటిగా అనుమతివ్వాలని సూచించారు. 85 ఏళ్ల వయస్సు దాటిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే సౌకర్యం పారదర్శకంగా నిబంధనల ప్రకారం చేపట్టాలన్నారు. అనంతరం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం పరిధిలోని భువనగిరి శివారులో అరోరా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ హాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జనగామ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పింకేశ్ కుమార్, జిల్లా ఉప ఎన్నికల అధికారి, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు.